సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



సోమశిలలో 25.993 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 25.993 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువల ద్వారా 3,050 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,790
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,819
3శాతం జీఎస్టీతో	రూ.5,993
నవర (8గ్రా)	రూ.47,944

గరిష్టం/కనిష్టం
30.6 /21.0

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 60 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణంగానే ఉంది. బుధవారం మార్పులేమీ ఉండవని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

పోర్టు కస్టమ్స్ సేవలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న కస్టమ్స్ మేనేజర్ భానుప్రకాష్

ముత్తుకూరు : అదానీ కృష్ణపట్నం పోర్టు కస్టమ్స్ సేవలకు అవార్డు లభించింది. అంతర్జాతీయ వాణిజ్య సేవలకు కస్టడీయల్ కేటగిరీలో అవార్డు, సర్టిఫికెట్ లభించినట్లు పోర్టు ఉన్నతాధికారులు మంగళవారం తెలిపారు. కస్టమ్స్ కమిషనర్ సీహెచ్ వెంకయ్యచౌదరి కాకినాడలో నిర్వహించిన అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా పోర్టు కస్టమ్స్ మేనేజర్ భానుప్రకాష్‌కు అవార్డు, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు సీఈఓ జీజేరావు మాట్లాడుతూ పోర్టులో ఎలక్ట్రానిక్ డేటా, ఇంటర్‌చేంజ్ డేటా కలిగి ఉండడం వల్ల త్వరితగతిన కస్టమ్స్ క్లియరెన్స్, కంటైనర్ క్లియరెన్స్ సాధ్యమవుతోందన్నారు. ఈ అవార్డు ద్వారా మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. కస్టమ్స్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు కృష్ణపట్నం పోర్టు కృషి చేస్తుందన్నారు.

ఉపకార వేతనాల దరఖాస్తుకు నేటితో ఆఖరు

నెల్లూరు(వేదాయపాళెం): 2023–24 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాల మంజూరు కోసం నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (పీఎంఎస్ఎస్‌వీ)లో దరఖాస్తుల గడువు బుధవారంతో ముగుస్తుందని, అర్హులైన వారు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారిత అధికారి వై.వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో 9, 10వ తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9290929699, 9182394143 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అలుపెరగని ఆపద్బంధు



జిల్లాలో..	108 వాహనాలు - 42
విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు - 100 మంది	2020 నుంచి సేవలు పొందిన వారు 3,20,115 మంది
పైలట్‌లు - 100 మంది	

ప్రమాదాలు, అత్యవసర సమయాల్లో బాధితులను, రోగులను ఆస్పత్రులకు తరలించడం, ప్రథమ చికిత్స అందించడంలో 108 వాహనం నంబర్ వన్‌గా నిలుస్తోంది. లక్షలాది మందిని ప్రాణాపాయం నుంచి కాపాడి అపర సంజీవనిగా వాసికెక్కింది. ఫోన్ చేస్తే చాలు నేనున్నానంటూ నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని ఆపద్బంధువుగా ఆదుకుంటోంది.

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రారంభం
- సీఎం జగన్ పాలనలోనూ ప్రజలకు అత్యాధునిక సేవలు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే బాధితులకు బాసటగా 108

నెల్లూరు సిటీ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పురుడు పోసుకున్న 108 వాహనం పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవలందిస్తోంది. ఎలాంటి ఆపద వచ్చినా నేనున్నానంటూ 'కుయ్ కుయ్ కుయ్..' అంటూ నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుంటోంది. ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసర చికిత్సలు అందించడంతో పాటు సమీప ఆస్పత్రులకు చేరుస్తోంది. అయితే గత టీడీపీ ప్రభుత్వంలో ఈ 108 వాహన సేవలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ 108 వాహన సేవలకు మళ్లీ జీవం పోశారు. ఈ వాహనాల సేవలకు మరింత వన్నెతెచ్చేలా వాటిలో అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలను ఏర్పాటు చేశారు. తద్వారా ప్రతి ఏటా సుమారు లక్ష మంది సహాయార్థులకు అత్యవసర సేవలు అందుతున్నాయి.

అత్యాధునిక పరికరాలు

జిల్లాలోని కావలి, కందుకూరు ఏరియా ఆస్పత్రుల్లో 2 నియోనేటల్ వాహనాలు ఉన్నాయి. ఏఎల్ఎస్ వాహనాలు 9, బీఎల్ఎస్ వాహనాలు 31 ఉన్నాయి. వీటి ద్వారా రోడ్డు ప్రమాద బాధితులను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, గర్భిణులను, డయాలసిస్ రోగులను, క్యాన్సర్ బాధితులను ఆస్పత్రికి తరలిస్తున్నారు. నడిచే ఐసీయూ తరహాలో ఏఎల్ఎస్ సౌకర్యం ఉన్న వాహనంలో వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్, ఇన్ఫ్యూజన్ పంప్స్, సిరంజి పంప్స్ ఏర్పాటు చేశారు. ప్రతి అంబులెన్స్‌లో ఆక్సిజన్, సక్షన్ ఆపరేటర్స్, మల్టీ పారామానిటర్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయి.

ఏటా లక్ష మందికి పైగా సేవలు

కొత్తగా వచ్చిన వాహనాలు జిల్లాలో 2020 జూలై నుంచి సేవలందిస్తున్నాయి. ఇప్పటి వరకు 3,20,115 మందికి ఈ సేవలందాయి.

గర్భిణులకు వరం



వాహనంలో కాన్పు చేసిన సిబ్బంది

జనవరి 12వ తేదీన కలిగిరి మండలంలో రజిని అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు నొప్పుల తీవ్రత ఎక్కువ కావడంతో తల్లి, బిడ్డను రక్షించేందుకు సిబ్బంది ఆ వాహనంలోనే కాన్పు చేశారు.

బాధితులకు బంధువు



సుబ్బయ్య అనే వ్యక్తికి 108లో వైద్యం అందిస్తున్న సిబ్బంది)

ముత్తుకూరు మండలంలోని ప్రధాన రహదారిపై ఇటీవల సుబ్బయ్య అనే వ్యక్తి బైక్‌పై వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు గమనించి 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని అతనిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో బాధితుడు సుబ్బయ్య ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

జీవం పోసిన జగనన్న

2019లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ 108 సేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. ఆయన 2020లో జిల్లాకు మొత్తం 36 నూతన 108 వాహనాలు కేటాయించారు. 6 పాత వాహనాలను ఆధునికీకరించారు. దీంతో మొత్తం 42 వాహనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల ప్రమాద బాధితులను, గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లడం, గుండెపోటు, మూర్ఛవ్యాధి, ఇతర అత్యవసర అనారోగ్య పరిస్థితుల్లో రోగిని ఆస్పత్రికి తరలించడం వంటి సేవలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాయి.

వైఎస్సార్ హయాంలో వైభవం.. బాబు హయాంలో దౌర్భాగ్యం

జిల్లాలో 2005 సంవత్సరంలో 108 వాహన సేవలు ప్రారంభమయ్యాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 108 సేవలను ప్రారంభించి విశేష సేవలందించి ప్రజల ఆదరాభిమానాలు పొందారు. అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ వాహనాల ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు సరైన సేవలు అందించలేకపోయింది. రిపేర్లకు గురైన వాహనాలకు మరమ్మతులు కూడా చేయించకపోవడంతో అవి మూలనపడ్డాయి. 2019కు ముందు జిల్లాలో కేవలం 28 వాహనాలు మాత్రమే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వాటిలో కూడా 10 మరమ్మతులకు గురై సేవలందించలేకపోయాయి.

సేవలను ఉపయోగించుకోండి



జిల్లాలో ప్రతి మండలంలో ఒక 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాం. ఫోన్ వచ్చిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సేవలందిస్తున్నాం. 108లో వెళితే తక్షణమే ప్రథమ చికిత్స అందిస్తూ ఆస్పత్రికి తరలిస్తున్నాం. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108కు కాల్ చేసి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

– పి.రాకేష్, జోనల్ మేనేజర్, అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్

అత్యవసర సమయాల్లో రోగిని సమయానికి ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడుతున్నాయి. కొన్ని పరిస్థితుల్లో గర్భిణీలకు 108 లోనే కాన్పులు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. యాక్సిడెంట్లకు సంబంధించి ప్రతి ఏటా 39,000 కేసులు రాగా, డయాలసిస్ కేసులు 5,200, గర్భిణి కేసులు 8 వేలు వస్తుంటాయి.

గ్రామ స్వరాజ్యం..

జగనన్నతో సాకారమైంది

- ఊసరవెల్లి చంద్రబాబును నమ్మొద్దు
- 'వైఎస్సార్ ఆసరా' 4వ విడత చెక్కుల పంపిణీలో మంత్రి కాకాణి



వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నమూనా చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని మన రాష్ట్రంలో సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మనుబోలు సచివాలయం-2 ఆవరణలో మంగళవారం 'వైఎస్సార్ ఆసరా' 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో పొదుపు మహిళల రుణాలను 4 విడతల్లో చెల్లిస్తానని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో 'వైఎస్సార్ ఆసరా' 4వ విడతలో 3,29,846 మంది పొదుపు మహిళలకు రూ.270.54 కోట్లు విడుదల చేశారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 4 విడతల్లో 34,443 పొదుపు సంఘాల్లోని 3,29,846 మంది మహిళలకు రూ.1074.39 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా చంద్రబాబు మాటలు మారుస్తాడంటూ మంత్రి దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో జగన్‌మోహన్‌రెడ్డి ఒక బటన్ నొక్కితే తాను 4 బటన్లు నొక్కుతానంటూ చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కరోనా సమయంలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకున్నా అమ్మఒడి సొమ్మును తల్లుల ఖాతాల్లో జమ చేయగా, ఎవరి సొమ్ము జమ చేస్తున్నారంటూ చంద్రబాబు విమర్శించారని, ఆయనే ఇప్పుడు ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తానని చెపుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014లో ఇంటికో ఉద్యోగం అని చెప్పిన చంద్రబాబు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇచ్చిన పాపాన పోలేదన్నారు. తన కుమారుడికే మాత్రమే మంత్రి పదవి ఇచ్చుకున్నారని గుర్తుచేశారు. తాను అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తానని చెబుతున్న చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు అభివృద్ధి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మునికి కలెక్టర్ నివాళి



నెల్లూరు(దర్గామిట్ట): జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ లవన్న, ఏఓ షఫీమాలిక్, తహసీల్దార్లు రాఘవేంద్రరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు వస్తే జన్మభూమి కమిటీలదే రాజ్యం



మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: 'పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను రద్దు చేస్తాడు. మళ్లీ జన్మభూమి కమిటీలు రాజ్యమేలుతాయి. ఆ దుస్థితి రాకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను పక్కాగా అందించే జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి' అని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మంగళవారం అల్లూరులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తే పేదలకు మంచి జరగదన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. రుణమాఫీ చేస్తానని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశాడన్నారు. సీఎం జగన్ వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకున్నట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం పరితపించే ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో కావలి ఏరియా కో–ఆర్డినేటర్ మధుసూదన్‌రావు, ఏపీఎం ప్రసాద్ రావ్, ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ ఫణికుమార్, జెడ్పీటీసీ వేణమ్మ, ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన మోసాలను మర్చిపోవద్దని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏమి చెప్పారో అదే చేస్తున్న విషయాన్ని మహిళలు గుర్తించాలన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. మెప్మా పరిధిలో 445 పొదుపు గ్రూపుల్లో ఉన్న 4,251 మంది సభ్యులకు రూ.3.66 కోట్లకు సంబంధించిన ఆసరా నమూనా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, మెప్మా సీఎంఎం అంకయ్య, సీఓ మాధవి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు జి.లక్ష్మి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దు



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): 'ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రజలెవరూ తెలుగుదేశం పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి మరోసారి ఆయన్ను సీఎం చేయాలి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ లబ్ధి పొందాలని ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. మండలంలో 887 సంఘాల్లో 8,820 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.18.23 కోట్లు, చేయూత ద్వారా మూడు విడతల్లో రూ.318.19 కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా నాలుగేళ్లలో రూ.103.3 కోట్లు, సున్నా వడ్డీ కింద రూ.1.03 కోట్లు, జగనన్న తోడు ద్వారా రూ.22.66 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ.12.94 కోట్లను అందించడం జరిగిందన్నారు. మహిళలకు ఇంత మొత్తంలో ఆర్థిక సాయం అందించింది ఒక్క జగన్ మాత్రమేనన్నారు. అనంతరం సీఎం చిత్రపటానికి ఆసరా లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మద్దూరు బాబు, మండల కన్వీనర్ రేవూరు శ్రీనివాసులురెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌రెడ్డి, డైరెక్టర్లు పోలుబోయిన వెంకటేశ్వర్లు, స్థానిక నేతలు గువ్వల కృష్ణారెడ్డి, గణపం రమేష్‌రెడ్డి, నీలం సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ



శిక్షణకు హాజరైన టీచర్లు

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని రోటరీ క్లబ్ భవనంలో జిల్లాలోని వివిధ యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు ఇస్తున్న వృత్యంతర శిక్షణ మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర ఏఎంఓ విజయభాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. చదువు పూర్తయ్యాక ఏం చేయాలనే విషయంపై వారికి స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ గంగా భవాని, ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్, డాక్టర్ శారద, అనూష, మంజునాథ్, విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిమ్మ ధరలు

- బస్తా కాయలు రూ.5 వేలు

పొదలకూరు: నిమ్మ ధరలు పెరుగుతున్నాయి. ఇటీవల కొంతమేర తగ్గిన విషయం తెలిసిందే. చలి తీవ్రత తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో నిమ్మకాయల వాడకం పెరిగింది. స్థానిక మార్కెట్ యార్డులో లూజు (బస్తా) రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు పలుకుతోంది. అయితే నాణ్యత కలిగిన కాయలకు మాత్రమే మంచి ధర లభిస్తోంది. ఇంకా మంచు కురుస్తుండటంతో కాయల్లో కొంత నాణ్యత లోపిస్తున్నట్లు తెలుస్తోంది. మిచాంగ్ తుఫాన్ కారణంగా తోటల్లో చెట్లు కూలిపోవడంతో పాటు పూత, పిందె రాలిపోవడంతో దిగుబడి తగ్గింది. ఫలితంగా సీజన్లో కాయలకు డిమాండ్ పెరిగి ధరలు బాగా పెరిగే అవకాశం ఉంది.

వీఆర్వోలకు పదోన్నతులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 13 మంది వీఆర్వోలకు పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రూరల్ మండలం చెన్నకేశవనగర్ వీఆర్వో చేవూరు అమరావతిని సీనియర్ అసిస్టెంట్‌గా దగదర్తి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. కోవూరు–1కు చెందిన ఆత్మకూరు ప్రసాద్ ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా, నందవరం అధికారి నిజమాల తిరుపతయ్య చేజర్ల తహసీల్దార్ కార్యాలయానికి, సర్వేపల్లి–2 వీఆర్వో కల్లూరు జనార్దనరెడ్డి సైదాపురం తహసీల్దార్ కార్యాలయానికి, దివిపాళెం–2 అధికారి దాసరి హనుమంతయ్య కలువాయి తహసీల్దార్ కార్యాలయానికి, కత్తిపల్లి నుంచి కర్రా రమణయ్య, మిట్టాత్మకూరు నుంచి కొత్తపాటి పుల్లయ్య, సంగం–1 నుంచి పెమల రవిబాబును ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి, పెదకొండూరు నుంచి షేక్ రహంతుల్లాను మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయానికి, తుమ్మూరు నుంచి గునపాటి మురళీకృష్ణను కావలి ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా, పొద్దపూడి అధికారి మదపుర్తి శ్రీనివాసులు కావలి ఆర్డీఓ కార్యాలయానికి, సాయిపేట గ్రామ రెవెన్యూ అధికారి ఏవీవీ ప్రసాద్‌రావును ఆత్మకూరు ఎస్‌డీసీ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.60
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25

కుష్టు వ్యాధి పక్షోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు సిటీ: కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి పక్షోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని వెంగళరావునగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి ఖాదర్‌వలీ, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ సునీత, డీఎఫ్‌ఐటీ కో ఆర్డినేటర్లు సతీష్, పీటర్, జిల్లా న్యూక్లియస్ సిబ్బంది నరసింహులు, రంగనాయకులు, డీపీఎంఓ సుబ్బయ్య, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు పక్కాగా ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలకు పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. మంగళవారం సంస్థ కార్యాలయంలో పోటీల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారంగా నేటి నుంచి జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించి ఫిబ్రవరి మూడో తేదీ నాటికి ఫైనల్స్ ముగించనున్నామని తెలిపారు. వివిధ విభాగాల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేయాలని సూచించారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించాలని తెలియజేశారు. జిల్లా స్థాయి విజేతలు 6వ తేదీన విశాఖపట్నంలో జరిగే పోటీలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ శర్మద, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీఈఓ గంగా భవాని, జిల్లా క్రీడా అధికారి యతిరాజ్, టీపీఆర్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉచిత శిక్షణ

నెల్లూరు(వేదాయపాళెం): సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిణి మందారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చరిత కంప్యూటర్స్ సహకారంతో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో రెండు నెలలు ఉచిత భోజనంతో కూడిన శిక్షణను వెంకటాచలం మండలం యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కనీస విద్యార్హత పదో తరగతి కలిగిన గిరిజన యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు వైటీసీ సెంటర్ మేనేజర్ బాలాజీ ఫోన్ నంబర్ 81878 99877, లేదా కొండాయపాళెం గేటు సెంటర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నన్నం కేశవులు (48) అనే వ్యక్తి మంగళవారం ఆటో నడుపుతూ పెనుబల్లిలోని ఇంటికి బయలుదేరాడు. ఈ సమయంలో శాల్మాంబపురం దాటిన తర్వాత అకస్మాత్తుగా ఓ వాహనం ఎదురురావడంతో బ్రేక్ వేశాడు. దీంతో కేశవులు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.

సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా సాంబశివరావు

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఇటీవల సీఐగా పదోన్నతి పొంది రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.సాంబశివరావును నెల్లూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. సాంబశివరావు గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పనిచేశారు. ట్రాన్స్‌కోలో పనిచేస్తూ ఇటీవల సీఐగా పదోన్నతి పొందారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి గాయాలు



రాఘవులు మృతదేహం

ఉలవపాడు: మోటార్‌బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై చాగల్లు జంక్షన్ సమీపంలో మంగళవారం ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడుకు చెందిన దిన సన్నిబోయిన రాఘవులు (55), సాలి సుబ్రహ్మణ్యం మామిడితోటలకు మందు కొట్టడానికి సంబంధిత డబ్బాలు తీసుకుని బైక్‌పై తెట్టు వైపు వెళ్తున్నారు. రాజుపాళెం దాటి చాగల్లు సమీపంలోకి వచ్చే సమయానికి లారీ వారి బైక్‌ను తగులుతూ వెళ్లిందని పోలీసులు చెబుతున్నారు. బైక్ పక్కకు వెళ్లే సమయంలో వెనుక నుంచి నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దానిపై వెనుక కూర్చుని ఉన్న రాఘవులు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి ఉలవపాడు సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేయించారు. కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై బాజిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో హెడ్ నర్సులుగా పనిచేస్తున్న ఐదుగురికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్యారోగ్య శాఖ సంచాలకుల (ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పించారు. నెల్లూరు ఏసీఎస్‌ఆర్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న వి.మల్లేశ్వరికి ప్రమోషన్ ఇచ్చి ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డీడీ శ్రీనివాసులురెడ్డి, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ నాగూర్ షరీఫ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ గిరిబాబు

ఉదయగిరి: పట్టణంలోని అభినాష్ లాడ్జిలో ఓ యువకుడు ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం కంబాలకుంట గ్రామానికి చెందిన సింగనమల వెంకటేష్ (23)కు చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించారు. అతను ఉదయగిరిలోని చాకలివీధిలో తన సోదరి సైదాపురం నాగమణి వద్ద ఉండేవాడు. ఐదేళ్లుగా మర్రిపాడు మండలం రామానాయుడుపల్లికి చెందిన చీమలదిన్నె రమణయ్య అనే మేస్త్రి వెంట తెలంగాణ రాష్ట్రంలో బేల్దారి పనులకు వెళ్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా రమణయ్యతో కలిసి ఉదయగిరికి వచ్చాడు. కొద్దిరోజుల క్రితం రమణయ్య ఆ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని తెలంగాణకు కూలీలను తీసుకెళ్లేందుకు గ్రామంలో తిరుగుతున్నాడు. నాలుగు రోజుల క్రితం నాగమణి ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకటేష్ మంగళవారం మధ్యాహ్నం తిరిగొచ్చాడు. ఆమె ఈ విషయాన్ని మేస్త్రికి చెప్పింది. మళ్లీ వెంకటేష్ ఎక్కడికైనా వెళ్లిపోతాడని రమణయ్య, నాగమణి కుమారుడు కలిసి అతడిని లాడ్జి గదిలో ఉంచి బయట తాళం వేసి టీ తాగేందుకు వెళ్లారు. వారు తిరిగొచ్చి తాళం తీసి తలుపును ఎంత కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా వెంకటేష్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ వేల్పుల గిరిబాబు తన సిబ్బందితో లాడ్జికి చేరుకుని తలుపులు పగులగొట్టి మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి హత్య.. నగల దోపిడీ

- ఆలస్యంగా వెలుగులోకి..



మస్తాన్‌బీ (ఫైల్)

సంగం: వృద్ధురాలిని హత్య చేసి ఆమె నగలు దోచుకెళ్లిన ఘటన మండలంలోని తలుపూరుపాడులో జరగ్గా ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తలుపూరుపాడు గ్రామానికి చెందిన మస్తాన్‌బీ (77), మస్తాన్ సాహెబ్ భార్యాభర్తలు. మస్తాన్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. వారింటి పక్కన ఆటో డ్రైవర్ అన్సర్‌బాషా ఉంటున్నాడు. అతను శనివారం మద్యం తాగేందుకు మస్తాన్‌ను వెంట తీసుకెళ్లాడు. అన్సర్ మద్యంలో మత్తు పదార్థాలు కలిపి మస్తాన్ చేత తాగించి రాత్రి సమయంలో ఇంటి వరండాలో పడుకోబెట్టాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి నిద్రపోతున్న మస్తాన్‌బీ ముఖంపై దిండు అదిమిపెట్టి హత్య చేసి ఆమె చేతులకు ఉన్న మూడు బంగారు గాజులు, మెడలోని నల్లపూసల దండ, బంగారు చైన్, ఉంగరం (మొత్తం కలిపి 8 సవర్లు) దోచుకుని పరారయ్యాడు. మస్తాన్ ఆదివారం సాయంత్రానికి మత్తు నుంచి తేరుకుని ఇంట్లోకి వెళ్లి భార్య మృతదేహాన్ని చూసి కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లుగా భావించారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మస్తాన్‌బీ మృతదేహానికి స్నానం చేయిస్తుండగా మెడపై గోళ్ల గాట్లు, వాపు కనిపించాయి. ఇదే సమయంలో అన్సర్‌బాషా గ్రామంలో విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేయడాన్ని గమనించారు. అతనే తన భార్యను చంపి ఉంటాడని మస్తాన్ భావించాడు. మంగళవారం మృతురాలి మనుమడు బాబు సంగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేశారు. బుధవారం మస్తాన్‌బీ మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం చేయిస్తామని, నిందితుడిని పట్టుకుంటామని తెలిపారు.